
ప్రజాశక్తి
సోమవారం 12 డిసెంబర్ 2022
5
విజయనగరం



చెకుముకి పోటీలు విజయవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తోటపాలెంలోని సత్య డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలు విజయవంతం అయ్యాయి. జిల్లాలోని 27 మండలాల నుంచి సుమారు 200 మంది 8, 9, 10వ తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు సైన్స్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్సు వాక్‌ను జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎం.వి.ఎస్ వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, నాయకులు వి.రాజగోపాల్, కె.మురళీబాబు, పి.సత్యంనాయుడు, కె.శశధర్, జి.నిర్మల, సునీల్, భువన, కిరణ్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను ఫణంగా పెట్టి..

కరోనా పేరు చెబితేనే 'బాబోయ్..' అంటూ కోసెడు దూరం పరుగులు పెట్టే కుటుంబ సభ్యులు, రక్తసంబంధీకులను చూశాం... అటువంటి రోగుల ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టినవారిలో మొదటి స్థానంలో నిలిచారు ఆశా కార్యకర్తలు. ఆ మాటకొస్తే కేవలం కరోనా సమయంలో మాత్రమే కాదు.., గర్భిణులు, బాలింతలు, బాలబాలికల ఆరోగ్య బాధ్యతను సైతం తమ భుజాన వేసుకుంటున్నారు. వారిని చేరదీసి ఆరోగ్య సూత్రాలు చెప్పడమే కాదు సుమా..! అనారోగ్యంతో అల్లాడుతున్న వారిని ఒక తల్లిలా.. ఓ తోబుట్టువులా అక్కున చేర్చుకుంటూ... తన కొంగు చెంగుతో నెత్తుటి మరకలు తుడుస్తూ.. అవసరమైతే ఆస్పత్రులకు సైతం తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో తన ఆరోగ్యాన్ని ఫణం పెట్టి... పిల్లలు, కుటుంబ సభ్యుల అవసరాలను సైతం పక్కనబెట్టి సంఘంలో సేవకులుగా నిలుస్తారు. ఇంతటి కీలక సేవలందించే ఆశా వర్కర్ల వెతలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వం చెల్లిస్తున్న పారితోషికంతో కుటుంబాన్ని నెట్టుకురాలేక, పనిభారం మోయలేక, రాజకీయ వేధింపులు తట్టుకోలేక నిత్యం సతమతమౌతున్నారు. వీటి పరిష్కారం కోసం ఎపి ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిత్యం పోరాడుతూనే ఉన్నారు. ఎన్నో విజయాలు సాధించుకున్నారు. మరికొన్నింటిపై పోరుబాట కొనసాగుతోంది. ఈనేపథ్యంలో విజయనగరం కేంద్రంగా సోమ, మంగళవారాల్లో యూనియన్ రాష్ట్ర మహాసభలు జరగనుండటంతో ఆశా కార్యకర్తల్లో పండగ వాతావరణం నెలకొంది. తమ కష్టనష్టాల్లో పాలుపంచుకుంటూ ముందుకు నడిపిస్తున్న సంఘం సభల్లో పాల్గొనేందుకు సన్నద్ధమయ్యారు.



కరోనా సమయంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్న ఆశా కార్యకర్త

- ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లదే కీలకపాత్ర
- ఇంట్లో ఇల్లాలిగా, సమాజంలో సేవకురాలిగా..
- కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు
- పారితోషికం అంతంత మాత్రమే
- ప్రభుత్వ పథకాలకు బహుదూరం
- నేడు, రేపు విజయనగరంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుమారు 16 ఏళ్ల క్రితం... 2006లో ఆశావర్కర్స్ వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. క్షేత్ర స్థాయిలో మాతా శిశు సంరక్షణకు ప్రాథమిక ఆరోగ్య సూత్రాలు చెప్పడంతోపాటు రోగులకు - ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా పనిచేయాలన్న లక్ష్యంతో నియమించిన ఆశా వర్కర్లు నేడు వైద్యారోగ్య రంగంలో అత్యంత కీలక భూమిక పోషిస్తున్నారు. కేవలం అప్పట్లో అప్పగించిన పనులకు మాత్రమే పరిమితం కాకుండా ఆ రంగంలో పోలియో చుక్కలు వేయడం మొదలుకుని, సుగర్, బిపి, క్షయ తదితర రోగులు, గర్భిణులు, క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందించే ఏర్పాట్లు చేయడంలో వీరికి వేరొకరు సాటిలేరని చెప్పొచ్చు. కాల క్రమేణా.. ఇలా ఎన్నో బాధ్యతలు, పని భారం పెరిగినా అందుకు తగ్గట్టు వేతనాలు పెరగలేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.3 వేల గౌరవ వేతనం, మరో రూ.3 వేల వరకు ఫిక్స్‌డ్ ఇన్సెంటివ్ అందేది. అనంతరం యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన పోరాటం వల్ల వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.10వేల నిఖర ఆదాయం అందుకునే వరకు వచ్చారు. పెరిగిన ధరలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ పారితోషికం ఏ మూలకూ సరిపోని పరిస్థితి. మరోవైపు ఆశాల ఆదాయంలో కోత, వర్కర్ల సంఖ్య కుదింపునకు 2019లో ప్రభుత్వం తీసుకొచ్చిన చర్యలను యూనియన్ పోరాడి నిలువరించింది. ఇంతటి చాకిరీ చేస్తున్న ఆశా కార్యకర్తలకు వారాంతపు సెలవులు గానీ, మెటర్నిటీ లీవులు గానీ లేవు.

రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో తొమ్మిది నెలల గర్భిణీగా ఉన్న కానూరు సోమాలమ్మ ఆశా కార్యకర్త విధినిర్వహణలో భాగంగా తన పరిధిలోని మరో గర్భిణిని ఆస్పత్రికి తరలించాక అక్కడే ఒక బిడ్డకు జన్మనిచ్చిన కొద్దిసేపట్లోనే తీవ్రమైన మానసిక ఒత్తిడి, శ్రమ తట్టుకోలేక చనిపోయింది. ఇప్పటికీ ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందలేదు. ఉద్యోగులుగా గుర్తించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వాలు ఫేషియల్ అటెండెన్స్‌కు సిద్ధపడటం గమనార్హం. ఎన్‌ఆర్‌హెచ్‌ఎం నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 1000 నుంచి 1200 జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో 2000 నుంచి 2,500 జనాభాకు ఒకరు చొప్పున ఆశా కార్యకర్తలను నియమించాలి. గిరిజన గ్రామాల్లో వెయ్యిలోపు జనాభా ఉన్నా ఒక కార్యకర్తను నియమించాలి. ఈ నిబంధనలు పక్కన బెట్టడంతో పట్టణాల్లో ఒక కార్యకర్త 7 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న 5 వేల మందికి సేవలందిస్తున్నారు. దీనికితోడు వైద్యారోగ్యశాఖ చేపడుతున్న ప్రతి సర్వేలను, ఆసుపత్రుల్లో క్లీనింగ్, ఎన్‌సిడి డిపి సర్వే వంటి అదనపు పనులను అప్పగిస్తుండడంతో ఆశాలకు తలకు మించిన భారంగా మారింది. సచివాలయ, పిహెచ్‌సి అధికారుల ఆధిపత్య పోరు మధ్య నలిగిపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. ఫొటోలు అప్‌లోడ్ చేయడానికి 2జి సిమ్ సహకరించని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, 26 వేలు చొప్పున కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ వంటి సదుపాయాలు కల్పించాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది. ఉద్యోగ విరమణ పొందినవారి కుటుంబ సభ్యుల్లో అర్హతను బట్టి తిరిగి ఆశా కార్యకర్తగా నియమించాలని, 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరుతున్నారు. ఇవేవీ పట్టించుకోని ప్రభుత్వం ఈ చిన్నపాటి గౌరవ వేతనం చెల్లిస్తున్నందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పింఛన్లు, అమ్మఒడి, చేయూత, విద్యాదీవెన వంటి ప్రభుత్వ పథకాల నుంచి దూరం చేసింది. రిక్రూట్ మెంట్లలో స్థానిక సంస్థల జోక్యం కల్పించడంతో ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు పెరిగాయి.

కోవిడ్‌లో కీలకపాత్ర

కోవిడ్‌తో ఉన్న వ్యక్తి కనిపిస్తేనే పారిపోయే రోజుల్లో ఆశా కార్యకర్తలు రోగుల ఇళ్లకు వెళ్లి మందులు సరఫరా చేశారు. ప్రభుత్వం తరపున శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించినా, రిస్క్ అలవెన్స్ ఇవ్వకపోయినా విధి నిర్వహణకు ఎక్కడా వెనుకాడ లేదు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 35 మంది కరోనా బారిన పడి చనిపోయారు. కోవిడ్ భయంతో మరో 10 మంది మరణించారు. వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. యూనియన్ పోరాటం వల్ల కరోనాతో చనిపోయిన వారిలో కేవలం ఆరుగురి కుటుంబ సభ్యులకు మాత్రమే రూ.50 లక్షల చొప్పున ఇన్స్యూరెన్స్ అందించింది.



కూడలిలో జెండాలను అలంకరిస్తున్న కార్మిక సంఘ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి

గత ఎన్నికల ఫలితాలే పునరావృతం

- సంక్రాంతి తర్వాత భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన
- వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ చేరువయ్యామని, జిల్లాలో గత ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. నగరంలోని ఫూల్‌బాగ్‌లో ప్రయివేటు కళ్యాణ మండపంలో ఆదివారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం జిల్లా అభివృద్ధికి సిఎం జగన్ కంకణబద్ధులై ఉన్నారని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు సంక్రాంతి తర్వాత శంకుస్థాపన చేయనున్నామని వెల్లడించారు. జలజీవన స్రవంతి పథకం కింద జిల్లాలో రూ.850 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి తొందర్లోనే టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు. పేదల కోసం జిల్లాలో లక్ష ఇళ్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. పెండింగ్ బిల్లులు సంక్రాంతిలోపు క్లియర్ అయ్యేట్టు చూస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకు అందించాలనే తమ ప్రభుత్వ విధానమని సుబ్బారెడ్డి ఉద్ఘాటించారు. సొంత సామాజిక తరగతి కోసం చంద్రబాబునాయుడు అమరావతిలో రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని విమర్శించారు. పచ్చ మీడియా అభూత కల్పనలతో ముందుకు వెళ్తున్న చంద్రబాబు రాబోయే ఎన్నికల్లో అభాసుపాలవక తప్పదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో బూత్ కమిటీల మాదిరిగా గృహసారథులతో సమాంతర పార్టీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. దీనిపై నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో తొందర్లో ముఖ్యమంత్రి సమావేశం అవుతారని తెలిపారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో టిడిపి నేత అశోక్‌కు కేంద్రమంత్రి పదవి వచ్చిందని సంతోషించామని, కానీ విమానాశ్రయం, యూనివర్సిటీ కోసం ఏంచేశారని ప్రశ్నించారు. తాము ఉత్తుత్తి మాటలు చెప్పే బాపతులం కాదని, వాస్తవాలు మాట్లాడాలని అశోక్‌కు హితవుపలికారు. ఎమ్మెల్యేలు ఫోన్లు ఎత్తడం నేర్చుకోవాలని, రాజకీయాల్లో ఉండే వారికి కమ్యూనికేషన్ ముఖ్యమని చురకలంటించారు. జిల్లాలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులతో కలిసి ముందుకు సాగాలని సూచించారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ కార్యకర్తల సమిష్టి కృషే పార్టీకి బలమన్నారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు ఒక్క వైసిపికి మాత్రమే ఉందన్నారు.

సమావేశంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మేయర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కేన్సర్ ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న గవర్నర్ హరిబాబు

గురుదేవ్ ట్రస్ట్ సేవలు వెలకట్టలేనివి

మిజోరాం గవర్నర్ హరిబాబు

ప్రజాశక్తి-కొత్తవలస

గురుదేవ్ ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. ఓ కుగ్రామంలో వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించి, ఉన్నత స్థాయి వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ఆదివారం మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో కేన్సర్ ఆస్పత్రికి హరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ పేరుతో ఎంతో మంది పేదలకు సహాయం చేస్తోన్న జగదీశ్‌బాబును అభినందించారు. అన్నింటినీ విడిచి వికలాంగులకు ఇటువంటి సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి జగదీశ్‌బాబు చేస్తున్న కృషి, ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు, రోగులపట్ల ఆయనకున్న మమకారం గొప్పదని కొనియాడారు. అనంతరం వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, కె.వి.చౌదరి, తహశీల్దార్ ప్రసాదరావు, ట్రస్ట్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలు కాదు.. నవమోసాలు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళావెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నది నవరత్నాలు కాదని, నవమోసాలు చేసిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసిలను ఉద్ధరించామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఉత్తరాంధ్రలో 67 శాతమున్న బిసిలకు ఏం చేశారని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, సలహాదారులు.. ఎవరైనా వచ్చి పది బిసి కుటుంబాలను కలిసి ఏమి చేశారో చెప్పమనండని సవాల్ చేశారు. బిసిలలో 99 శాతం పేదలే ఉన్నారని తెలిపారు. పాదయాత్ర సమయంలో పేదలకు ఇచ్చే పింఛను 3 వేల రూపాయలు చేస్తానని హామీనిచ్చి మడమతిప్పారని విమర్శించారు. ఉత్తరాంధ్రలో ఎక్కువ మంది రైతు, వ్యవసాయ కూలీలేనని, వారికోసం ఏంచేశారని పాలకులను ప్రశ్నించారు. రుషికొండకు బోడిగుండు కొట్టి, ఏడాదికి ఐదారు కోట్ల రూపాయల ఆదాయానికి గండిపెట్టారని ధ్వజమెత్తారు. బిసి విద్యార్థుల్లో విదేశీ విద్యకు ఎంతమందిని పంపించారో తెలపాలన్నారు. ఉత్తరాంధ్రలో రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర లేక, సరైన కాలంలో రుణాలు రాక వారు పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇవేవీ పట్టని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి.. మీట నొక్కడంతోనే పాలన పూర్తయినట్లు భావిస్తున్నారని ఎద్దేవాచేశారు. రానున్న ఎన్నికల్లో వాలంటీర్ల ద్వారా ప్రజలను భయపెట్టి లబ్ధిపొందాలని చూస్తోందని ఆరోపించారు. సమావేశంలో మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, టిడిపి విజయనగరం అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి బంగారు రాజు, వర్మ రాజు, కొండపల్లి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళావెంకటరావు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కోవిడ్‌తో మరణించిన ఆశాల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం
- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఆశా కార్యకర్తలపై పనిభారం తగ్గించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోవిడ్‌తో మరణించిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టంచేశారు. అక్రమ కేసులు, నిర్బంధాలు, బెదిరింపులు సరికాదన్నారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలు విజయనగరంలో రెండు రోజులపాటు జరగనున్న నేపథ్యంలో ఆమె 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే...

వైసిపి ప్రభుత్వం వచ్చాక గౌరవ వేతనాన్ని కొంత పెంచినమాట వాస్తవమే. కానీ అది పనికి, పెరిగిన ధరలకు తగ్గట్టు లేదు. ఉద్యోగులుగా గుర్తించాలంటే కార్యకర్తలను ఎలా గుర్తిస్తామంటున్నారు. పనిమాత్రం ఉద్యోగులతో సమానంగా చేయించుకుంటున్నారు. అందుకే ప్రభుత్వం రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలి. ఎన్‌సిడి డిసి వంటి సర్వేల నుంచి ఆశా వర్కర్లను మినహాయించాలి. రంపచోడవరంలో విధి నిర్వహణలో మృతి చెందిన 9నెలల గర్భిణీ కాకూరు సోమాలమ్మ మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని, ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలి. వారాంతపు సెలవులు, మెడికల్, మెటర్నిటీ లీవ్‌లు ప్రకటించి, అమలు చేయాలి. విరమణ పొందిన ఆశా వర్కర్లకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62ఏళ్ల రిటైర్మెంట్ జిఒని వర్తింపజేయాలి. 2020 మార్చి నుండి మరణించిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి. ఆయా కుటుంబాల్లో అర్హులైన వారిని ఆశా కార్యకర్తలుగా నియమించాలి. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండానే ఆశా కార్యకర్తల కుటుంబాలను సంక్షేమ పథకాలకు దూరం చేయడం సరికాదు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. నాణ్యమైన సెల్ ఫోన్స్, 4జి సిమ్ ఇవ్వాలి. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశా కార్యకర్తలకు వెయిటేజి ఇవ్వాలి.. పై సమస్యలపై యూనియన్ ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడుతుంటే ప్రభుత్వం బెదిరింపులకు, నిర్బంధాలకు పాల్పడుతోంది. ఇది ఏమాత్రమూ సరికాదు. సమస్యలపై గళం విప్పడం పౌరహక్కు. అటువంటి హక్కులను కాలరాస్తూ చలో కలెక్టరేట్లు చేపట్టినప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వందలాది మందిపై అక్రమ కేసులు బనాయించారు. తెల్లచీర కట్టుకున్న వారందర్నీ బస్సుల్లో అడ్డుకుని భయభ్రాంతులకు గురిచేశారు. సమస్యలు సామరస్యంగా పరిష్కరిస్తే అటు ప్రభుత్వానికి, ఇటు ఆశా కార్యక్తలకు మంచిదే. అలా కాకుండా ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీలక్ష్మి



బ్యాటింగ్ చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఉత్సాహంగా జెపిఎల్ ప్రారంభం


ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని అయోధ్య మైదానంలో జగనన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహ పూరిత వాతావరణంలో ఆదివారం ప్రారంభమైంది. సిఎం జగన్ 50వ జన్మదినం సందర్భంగా వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన దంపతుల సౌజన్యంతో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీలక్ష్మి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం క్రికెట్ పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లను ఎగురవేశారు. జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు బ్యాటింగ్ చేయగా ఎమ్మెల్సీ రఘురాజు బౌలింగ్ చేసి పోటీలను ప్రారంభించారు ఈ సందర్భంగా అతిథులు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ తమ సందేశాలు చేశారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్ల నుంచి 50 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో 50 జట్లను తయారు చేసి, పోటీలు నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అవనాపు విక్రమ్, భావన దంపతులకు అభినందనలు తెపారు. మొదటిరోజు జరిగిన పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. 35వ డివిజన్ స్టార్ లెవెన్స్, మూడో డివిజన్ వజ్రపు లెవెన్స్, 22వ డివిజన్ డికె యూత్, 28వ డివిజన్ వినయ్ లెవెన్స్ జట్లు విజయం సాధంచారు.

కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ కార్యదర్శి తిలక్, ఎస్.కోట వైస్ ఎంపిపి సుధారాజు, వైసిపి నాయకులు కొండ రాజీవ్‌గాంధీ, కాళ్ల గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు

- ప్రారంభానికి సిద్ధంగా 1700 ఇళ్లు
- 21 నాటికి 29 వేల ఇళ్ల పూర్తే లక్ష్యం
- బిల్లుల చెల్లింపులో జాప్యం లేదు
- ఇసుక, సిమెంట్, ఇనుము సకాలంలో పంపిణీ
- 'ప్రజాశక్తి'తో గృహ నిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి ముఖాముఖి





ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణం జిల్లాలో శరవేగంగా సాగుతోందని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రమణమూర్తి అన్నారు. బిల్లులు, గృహ నిర్మాణ సామగ్రి సకాలంలోనే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు కూడా నిర్మాణం పట్ల ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. డిసెంబర్ 21న సామూహిక గృహప్రవేశాలకు సన్నాహాలు చేస్తున్నామని, అప్పటికల్లా 29 వేల ఇళ్లను పూర్తిచేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పీడీ జిల్లాలో సాగుతున్న గృహ నిర్మాణంపై వివరించారు.

జిల్లాలో మొత్తం జగనన్న లేఅవుట్లు ఎన్ని? ఎన్ని కేటగిరీల్లో విభజించారు?.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 651 లేఅవుట్లను ప్రభుత్వమే తయారు చేసి, పేదలకు అప్పగించింది. వీటిలో 500కుపైగా ప్లాట్లు ఉన్న లేఅవుట్లు ఏడు ఉన్నాయి. వీటిలో గుంకలాం లేఅవుట్ ఒకటి. ఇది రాష్ట్రంలోనే అదిపెద్ద లేఅవుట్. 101 నుంచి 500లోపు ప్లాట్లుగల లేఅవుట్లు 31, 51నుంచి 100లోపు ప్లాట్లు ఉన్నవి 75, 21 నుంచి 50 ప్లాట్లు గలవి 149, 10 నుంచి 20 ప్లాట్లు 135, 10 ప్లాట్ల లోపు ఉన్నవి 254 లేఅవుట్లు ఉన్నాయి.

ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు? ఎన్ని ప్రారంభమయ్యాయి?.

జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో 37,101 ఇళ్లు మంజూరు చేశాం. సొంత స్థలాల్లో 41,057 ఇళ్లు మంజూరు చేశాం. వీటిలో 3046 ఇళ్ల పనులు మాత్రమే ఇప్పటికీ ప్రారంభం కాలేదు. మిగిలిన ఇళ్లన్నీ వివిధ దశల్లో ఉన్నాయి.

సామూహిక గృహప్రవేశాలు ఎప్పుడు చేపడుతున్నారు?.

డిసెంబర్ 21నాటికి సామూహిక గృహప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటికల్లా జిల్లా మొత్తంగా కనీసం 29 వేల ఇళ్లను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు లబ్ధిదారులు కూడా ఉత్సాహంగా ఉన్నారు. అయితే, ఇటీవల కురుస్తున్న వర్షాలు నిర్మాణ పనులకు కొంత ఆటంకంగా ఉన్నాయి.

ఏయే దశల్లో ఎన్నెన్ని ఇళ్లు ఉన్నాయి?.

జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలోనే సుమారు 19,669 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వీటిలో బిలో బేస్‌మెంట్ లెవెల్‌లో 9,719, బేస్‌మెంట్ లెవెల్‌లో 1315, స్లాబ్ లెవెల్‌లో 1681, స్లాబ్ పూర్తిచేసినవి 1671 వరకు ఉన్నాయి. సొంత స్థలాల్లో కట్టుకున్నవి కూడా సుమారు 50 శాతం తుదిదశకు వచ్చాయి.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పన ఎంత వరకు వచ్చింది?.

నీరు, రోడ్లు, సైట్ లెవిలింగ్, రెండు, సిమెంట్ గోడౌన్ల నిర్మాణం, విద్యుత్ సదుపాయాల కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న లేఅవుట్లకు రూ.1.13 కోట్లు మంజూరు కాగా, సుమారు రూ.కోటి విలువైన పనులు జరిగాయి. దీంతో లబ్ధిదారులకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది. అందువల్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.



పూడమ్మ వనంలో ఒకేచోట కలిసి సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

నెల్లిమర్ల : స్థానిక సికెఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1993-94 ఏడాది 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలిశారు. ఆదివారం స్థానిక పూడమ్మ తల్లి వనంలో పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను ఒక్కసారిగా గుర్తు చేసుకున్నారు. అనంతరం వివిధ రంగాల్లో స్థిర పడ్డవారు ఉత్సాహంగా ఉల్లాసంగా కలిసి తిరిగి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 1993-94 పదవతరగతి చదువుకున్న వారిమంతా ఒకరికొకరు సహాయం, సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంతి రాంబాబు, బోగాపురపు నాగేశ్వర రావు, ఆల్తి వెంకట్రావు, కెల్ల కోటేశ్వరరావు, వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయికృష్ణకు ఎమ్మెల్యే అభినందన



సాయికృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

వేపాడ : నీలకంఠాపురం పంచాయతీ జమ్మాదేవి పేట గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన పెనగంటి శ్రీనివాస రావు తనయుడు వర్షిత్ వెంకట సాయి కృష్ణ ఎన్‌డిఎ -149 బ్యాచ్‌లో ఆలిండియా 239 ర్యాంకు సాధించాడు. దీంతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తన స్వగ్రామంలో ఆదివారం అతన్ని అభినందించారు. ఎన్‌డిఎ 239 ర్యాంకు సాధించిన వర్షిత్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోని ఫ్లైయింగ్ బ్రాంచ్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నాడు.

కన్వీనర్‌గా అప్పలనాయుడు

బొబ్బిలి : టిడిపి బిసి సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్‌గా కొల్లి అప్పలనాయుడు, సభ్యులుగా బోరపురెడ్డి వెంకటరమణ, బొంతు త్రినాథను అధిష్టానం నిర్ణయించినట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బేబినాయన తెలిపారు. బిసిల సంక్షేమానికి టిడిపి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. వీరిని మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్

బొబ్బిలి : బెల్ట్ షాపుకు అక్రమంగా తరలిస్తున్న 45 మద్యం సీసాలను ఎస్ఇబి బివి రమణ సీజ్ చేశారు. పెంట బెల్ట్ షాపుకు బొబ్బిలి నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మార్గమధ్యంలో దాడి చేసి 45మద్యం సీసాలు సీజ్ చేసి వ్యాపారి సిరికి గణపతిను అరెస్టు చేశారు.

వికలాంగులకు ఇళ్ల పట్టాలివ్వాలి

సాలూరు : జిల్లాలోని వికలాంగులకు ఇళ్ల పట్టాలు, భూమి పట్టాలు మంజూరు చేయాలని మదర్ థెరిసా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జిల్లెల సీతారాం కోరారు. ఆదివారం ఆయన అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు రైలు పాసులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్ మొత్తాన్ని రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచాలని కోరారు. భూమి, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి రవితేజ పాల్గొన్నారు.

ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించాలి

పార్వతీపురం రూరల్ : ఎయిడెడ్ పాఠశాలల నుంచి ప్రభుత్వంలోకి విలీనమైన ఉపాధ్యాయులకు ముందుగా కౌన్సిలింగ్ జరిపిన ఆ తర్వాత సాధారణ బదిలీలు జరిపి వారికి న్యాయం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి తమ సంఘం ద్వారా ప్రాతినిధ్యం చేయనున్నట్టు తెలిపారు. రేషనలైజేషన్ ద్వారా బదిలీకి గురవుతున్న ఉపాధ్యాయులకు ఎటువంటి షరతులూ లేకుండా రేషనలైజేషన్ పాయింట్లు కేటాయించాలని కోరారు.

30 మందికి చీరలు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీ పురం ప్రాంతంలో నివాసం ఉంటున్న 30మంది నిరుపేదలకు కాపు సంఘ సభ్యులు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. మాజీ జెడ్‌పిటిసి అలజంగి భాస్కరరావు 20 చీరలు అందించారు. మరో పది చీరలను కాపు సంఘం సభ్యులు సమకూర్చారు. నిరుపేదలకు చీరలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షులు కొన్నిన మన్మధరావు, ఉపాధ్యక్షులు సొంటేన రాజేష్, సభ్యులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కురుపాం : తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎస్ఎన్‌సియుల్లో రోగులకు, బాలింతలకు కాపు సంఘ నాయకులు నెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీధర్, శ్వేత, ఐసిటిసి కౌన్సిలర్ ఎ.మోహనరావు, వైద్య సిబ్బంది, కాపు యువత జి.డిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం జిల్లా రైస్ మిల్లర్స్ భవనం ప్రారంభం

పార్వతీపురంటౌన్ : పట్టణ శివారులో గల వెంకంపేట గోలీలు కూడలి, ప్రధాన రహదారి పక్కన పార్వతీపురం మన్యం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ కొత్తగా ఏర్పాటు చేసిన భవనంలో కార్యకలాపాలు చక్కగా నిర్వహించి అసోసియేషన్ మంచి అభివృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో బ్యాంక్ గ్యారంటీ పత్రాలను ప్రభుత్వానికి అందజేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తకోట రమేష్, ఉపాధ్యక్షులు జి.ఉదయభాను, బి.ప్రసాద్, సెక్రటరీ టి వెంకటరమణ, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటివలసలో గడపగడపకు..

సీతానగరం : మండలంలోని తామర కండి సచివాలయ పరిధిలోగల రేపటి వలసలు ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా తెలుసుకుని న్యాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం. బాబ్జి, ఎంపిపి బి. రమణమ్మ, శ్రీరాముల నాయుడు, బి. చిట్టిరాజు, ఎం. ధనుంజయ, ఎం. రామకృష్ణ, శ్రీనివాసరావు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు డోలమడలో..

పాలకొండ రూరల్ : మండలంలోని డోలమడ సచివాలయ పరిధిలో గల బర్న, వంతవాడ, వంతవాడ కాలనీ, డోలమడ వలస, డోలమడ ప్రాంతాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ విశ్వాసరాయి కళావతి వైసిపి శ్రేణులతో కలిసి పాల్గొంటారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఎంఎల్ఎ నేరుగా ప్రజలతో మాట్లాడి వారి నుంచి వినతులు స్వీకరిస్తారని ఎంపిడిఒ దొంక త్రినాథులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన సమస్యలపై 19న భారీ ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న పార్వతీపురంలో అతిపెద్ద ర్యాలీ నిర్వహిస్తామని ఆదివాసీ నాయకులు ఆదివారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ మేరకు మండలంలోని రేగిడిలో గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బెంతు ఒరియాలను ఆదివాసీలుగా మార్చొద్దని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలోనే ఏకలవ్య కస్తూర్బా పాఠశాలల్లో ఉద్యోగాలు గిరిజనులనే నియమించాలని పేర్కొన్నారు. జీవో 3ను కోర్టు కొట్టేసిన నేపథ్యంలో దాని స్థానంలో కొత్త జీవోను తీసుకురావాలన్నారు. తాము నిర్వహిస్తున్న ర్యాలీని జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా కార్యదర్శి పువ్వల సత్యనారాయణ, తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

వైసిపితో అభివృద్ధి శూన్యం



వేపాడ: చినగుడిపాలలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వేపాడ

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని చినగుడిపాల గ్రామంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వ పాలనలో మహిళలకు భద్రత కరువైందన్నారు. నిత్యావసరాలు, విద్యుత్ చార్జీలు, ఆర్‌టిసి ఛార్జీల ధరలను పెంచేయడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, సీనియర్ నాయకులు వేచలపు రామకృష్ణ, జగ్గుబాబు తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: మాట్లాడుతున్న మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు

డెంకాడ: మండలంలోని బంటుపల్లి పంచాయతీ గొంపవానిపాలెంలో ఆదివారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వ పేదలను నట్టేట ముచేస్తోందని వెంటనే గద్దె దించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సంఘం సురేష్, పి. భాస్కరరావు, బి. రవికిరణ్, ఆకుల సతీష్, కె. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - గుర్ల

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు గుర్ల జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల పీడీ ఉదయ కుమార్ తెలిపారు. ఈ నెల 18,19, 20 తేదీలలో రేణుగుంటలో జరిగే అండర్ 14, అండర్ 17 విభాగాలలో వీరు పాల్గొంటారన్నారు. కళాశాల నుండి ఎంపికైన 15 మంది విద్యార్థులలో 9 మంది బాలికలు, 6 గురు బాలురు ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు. రేణుగుంటలో జరిగే పోటీల లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

స్కూల్ గేమ్స్ పోటీలో సత్తా

గరివిడి : మండలంలోని వెదుళ్ల వలస గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు సాఫ్ట్ బాల్, బేస్బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ వెంకటరావు ఆదివారం తెలిపారు. ఈనెల 9న పారాది ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గేమ్స్ తమ పాఠశాలకు చెందిన గంట మణికంఠ, మడపాన దుర్గాప్రసాద్, కోన జస్వంత్, భీంపల్లి గణేష్, కొండోతు కిరణ్ కుమార్, పడాల ఈశ్వరమ్మ, పడాల ఝాన్సీ, నమరి మోహనలక్ష్మి ఎంపికయ్యారన్నారు. ఈనెల 20వ తేదీన శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు టి. విజయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు.



పూసపాటిరేగ: ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు



గుర్ల: కుస్తీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కొప్పెర్లలో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఈ ఎంపిక పోటీలో పాల్గొని తలబడ్డారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌జిఎఫ్ సెక్రటరీ ఎల్‌వి రమణ, జిల్లా హ్యాండ్ బాగ్ సెక్రెటరీ మల్లేశ్వరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కొప్పెర్ల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు



అధ్వాన్నంగా ఉన్న గరివిడి- మొరకముడిదాం రహదారి

అధ్వానంగా ప్రధాన రహదారి

ప్రజాశక్తి- గరివిడి

గరివిడి నుంచి మెరకముడదాం వెళ్ళే రహదారి గుంతలతో అధ్వాన్నంగా తయారయ్యింది. గరివిడి మండల కేంద్రం నుంచి మెరకముడిదాం, భైరిపురం, గర్భాం తదతర గ్రామాలకు నిత్యం ఈ రహదారి నుంచే ఆటోలు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు ప్రయాణించాల్సి ఉంది. రహదారి ఎక్కడికక్కడ గుంతలు పడటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా గరివిడి ఆర్‌ఒబి నుంచి తాటిగూడ ఉన్నత పాఠశాల వరకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి చీకటి పడితే రహదారి గుంతలు కానరాక ప్రయాణికులు, వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. నిత్యం భారీ వాహనాలు పరిమితికి మించి అధిక బరువుతో ఇదే రహదారి మీద ప్రయాణం చేయడం ద్వారా రోడ్డు శిథిలావస్థకు చేరి గుంతలుగా మారిందని పలుమార్లు రహదారి గుంతలు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గుంతలు పూడ్చి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

బాల్య వివాహాలను నిరోధించాలి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

బాల్య వివాహాలను నిరోధించాలని జిల్లా సామాజిక, పరివర్తన సమాచార వ్యవస(ఎస్‌బిసిసి) జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ అన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే లింగ వివక్ష ఉండరాదని మగ పిల్లలను, ఆడ పిల్లలను సమానంగా చూడాలని పిలుపునిచ్చారు. ఆదివారం పూసపాటిరేగ కెజిబివి పాఠశాల విద్యార్థులకు లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లింగ వివక్ష వల్ల లింగ నిష్పత్తి తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగించే పరిణామమన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రం సుస్థిర అభివృద్ధి సాధించాలంటే బాల్య వివాహాలు, రక్తహీనత వంటి వాటిని అరికట్టాలన్నారు. రాష్ట్రంలో బాల్యంలోనే గర్భందాల్చిన వారిలో 59 శాతం మంది మహిళలు కేవలం రక్తహీనతతో మరణిస్తున్నారని బాల్య వివాహాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కనీసం 18 ఏళ్లు నిండకుండా తల్లిదండ్రులు ఆడపిల్లలకు పెళ్లి చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

దుర్గాప్రసాద్‌కు పురస్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల



జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్‌కు విశ్వ మానవ హక్కుల అభినందన పురష్కారం లభించింది. ఆదివారం ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ దుర్గాప్రసాద్ చేసిన సామాజిక సేవలను గుర్తించి అభినందన ధ్రువ పత్రం అందజేసింది. జిల్లా ఆర్టిఐ అధ్యక్షులుగా దుర్గ ప్రసాద్ సాధన యువజన సంఘం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక చైతన్యం కల్పించి సేవలు అందిస్తున్న నేపధ్యంలో అభినందన ధ్రువ పత్రం అందజేశారు. ఈ సంధర్భగా దుర్గాప్రసాద్‌ని మిత్రులు పసుమర్తి వెంకటరమణ, బెల్లాన వెంకటరావు, స్ఫూర్తి సాయి కుమార్, చేయూత రాము, గ్రామస్థులు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు ఆతవలో గడపగడపకు..

వేపాడ : మండలంలోని ఆతవ గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఎం. జగ్గుబాబు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపిపి, జెడ్‌పిటిసిలు పాల్గొంటారని, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు సైన్సు, గణితం ప్రదర్శన

వేపాడ : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి సైన్స్, మ్యాథ్స్ ప్రదర్శన నిర్వహిస్తామని ఎంఇఒ జి. శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క ప్రభుత్వ పాఠశాల నుంచి ఐదుగురు చొప్పున సైన్సు మ్యాథ్స్ ప్రదర్శనలో విద్యార్తులు పాల్గొనాలన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జనవరి 27, 28 తేదీలలో జిల్లాస్థాయిలో జరగనున్న పోటీలకు పంపిస్తామన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం

ప్రజాశక్తి- వేపాడ

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి జనసేన పార్టీ నియోజకవర్గం స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసిందని ఆ పార్టీ మండల అధ్యక్షులు సుంకరి అప్పారావు అన్నారు. ఆదివారం ఆకుల సీతంపేటలో సభను ఏర్పాటు చేశారు. ముందుగా మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ చేపట్టారు. జొన్నపల్లి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో అప్పారావు మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం జనసేన కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. గ్రామాలు అభివద్ధి చెందాలంటే యువతలో ప్రశ్నించే తత్వం రావాలని అప్పుడే అవినీతి జరగకుండా పారదర్శకంగా అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరవనితలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

బొబ్బిలి : ఆర్‌టిసి బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. పార్వతీపురం డిపోకు చెందిన పాసింజర్ బస్సు బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్తుండగా గొర్లె సీతారాంపురం వద్ద స్టీరింగ్ పట్టివేయడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతులోకి దూసుకుపోయింది. డ్రైవర్ కృష్ణ చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపు చేయడంలో పెను ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రయాణికులు సహాయంతో బస్సును రోడ్డుపైకి నెట్టి విజయనగరం వెళ్లారు.



గోతులోకి ఒరిగిపోయిన ఆర్‌టిసి బస్సు

వాహనాలు తనిఖీ

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్ కూడలిలో ఆదివారం ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మోటార్ బైక్‌కు సంబంధించి అన్ని రకాల కాగితాలు ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికు లను ఎక్కించరాదని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను అందరూ పాటించాలని ఆయన తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

108లో ప్రసవం

ప్రజాశక్తి - గజపతినగరం

దత్తిరాజేరు మండలం దత్తి గ్రామానికి చెందిన గర్భిణీ పి.ఆదిలక్ష్మి ప్రసవం కోసం స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరారు. ఆదివారం అత్యవసర సేవలు అవసరం నిమిత్తం వైద్య సిబ్బంది విజయనగరం ఘోష ప్రసూతి ఆసుపత్రికి 108లో ఆమెను తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె ప్రసవించి ఆడపల్లికు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈ.ఎమ్.టి కె.కుమారి, పైలట్ బి.సత్యనారాయణ తెలిపారు. అనంతరం విజయనగరం గోషాసుపత్రిలో చేర్పించినట్లు చెప్పారు.



బిడ్డను సంరక్షిస్తున్న ఇఎన్‌టి కుమారి

క్రీడాకారులకు అభినందన

బొబ్బిలి : విజయనగరం రాజీవ్ స్టేడియంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొని విజయం సాధించిన క్రీడాకారులను టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బేబినాయన ఆదివారం అభినందించారు. పట్టణానికి చెందిన చిరంజీవులు, రెడ్డి సృజన, రెడ్డి శృతికీర్తనలు ప్రథమస్థానం పొంది రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారని కోచ్ సుధాకర్ యాదవ్ తెలపడంతో ఆయన క్రీడాకారులను కోటలో అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి మరిన్ని పథకాలు సాధించి బొబ్బిలికి, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ సుధాకర్ యాదవ్‌ను కూడా అభినంధించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న బేబినాయన

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

వికలాంగులకు అవసరమైన వివిధ ఉపకరణాల నిమిత్తం ఈనెల 12న సోమవారం నిర్ధారణ శిబిరం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించనున్నట్టు సంబంధిత ఉపాధ్యాయులు సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలకు చెందిన 0 నుంచి 18 ఏళ్లు గల వికలాంగులు మాత్రమే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన వికలాంగులు సదరం, ఆధార్, తెలుపురంగు రేషన్‌కార్డుతో పాటు మూడు పాస్‌ఫోటోలు తీసుకురావాలన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి శిబిరం జరగనున్నట్టు తెలిపారు. అర్హత ఉన్న వికలాంగులంతా తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చి ఈ అవకాశాన్ని వినిగియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన వారికి ఉచితంగా ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 9182867188 నెంబర్‌ను సంప్రదించాలన్నారు..

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

ప్రజాశక్తి- విజయనగరం

ఉద్యోగులకు నష్టం కలిగించే సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయాల్సిందేనని ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా చంద్రశేఖరరాజు, ప్రధాన కార్యదర్శి టి.విజయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం పట్టణ అధ్యక్షులు మువ్వల గంగాప్రసాదరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు రావలసిన సరెండర్ లీవులను నగదు రూపంలో ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 12వ పిఆర్‌సి కాలయాపన లేకుండా తక్షణమే విడుదల చేయాలన్నారు. ఇహెచ్ఎస్ ద్వారా నగదు రూపంలో వైద్యం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు అంశాలపై తీర్మానించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ, పట్టణ సహాధ్యక్షులు డి.రవికుమార్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీను, కార్యదర్శి జి.రమేష్, కోశాధికారి జి.అప్పారావు, సహాయ కార్యదర్శి ఎం.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు చంద్రశేఖరరాజు

13న ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ మహాసభ

విజయనగరం టౌన్ : ఎపిఎన్‌జిఒ టౌన్ యూనిట్ మహాసభ మంగళవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు జె.మురళి, టౌన్ కమిటీ అధ్యక్షులు రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సంఘం పట్టణ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

13న ఉపకరణాల గుర్తింపు శిబిరం

రామభద్రపురం : ఈ నెల 13న రామభద్రపురంలోని భవిత సెంటర్లో నియోజకవర్గ పరిధిలోని 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని అర్హులైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆటోకు వేలం

బొబ్బిలి : స్థానిక పోలీసుస్టేషన్లో సోమవారం సీజ్ చేసిన ఆటోకు వేలం వేయనున్నట్లు పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొవాలని కోరారు.

అగ్నిపథ్‌కు ఇద్దరు ఎంపిక

బొబ్బిలి : వీర బొబ్బిలి క్రీడా మైదానంలో ఉచితంగా శిక్షణ పొందిన ఇద్దరు అభ్యర్థులు అగ్నిపథ్‌కు ఎంపికయ్యారు. ఇటీవల చేపట్టిన అగ్నిపథ్ ఎంపికల్లో అంటిపేటకు చెందిన భానుప్రసాద్, దిబ్బగుడివలసకు చెందిన వేణు ఎంపికైనట్లు కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. వారిని కోచ్‌తోపాటు పలువురు అభినందించారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మనస్థాపనతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చినమేరంగిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దాసరి దుర్గాప్రసాద్ (29)కు ఏడు నెలల క్రితం వివాహమైంది. తన మేనకోడలను ప్రేమించిన దుర్గాప్రసాద్‌కు వేరే అమ్మాయితో వివాహమైంది. అనంతరం భార్యాభర్తల మధ్య వివాహ తరచూ గొడవలు జరిగి మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో దుర్గాప్రసాద్ తన ఇంటి సమీపానికి ఉన్న కళ్లాంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాలపడ్డాడు. మృతుడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.



మృతి చెందిన దుర్గా ప్రసాద్